సాక్షి
ప్రకాశం

శనివారం । 21 । జనవరి । 2023



పేదల అభ్యున్నతే ధ్యేయం
పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. త్రిపురాంతకం మండలం మేడపిలో పర్యటించారు. - 8లో..



మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా త్రిపురాంతకంలో ఏర్పాట్లను మంత్రి ఆదిమూలపు సురేష్ పరిశీలించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29/19

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

పలువురు తహశీల్దార్లకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

ఒంగోలు అర్బన్: జిల్లాలో పలువురు తహశీల్దార్లకు పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో మార్కాపురం తహశీల్దార్ శ్రీనివాసరావును పోలవరం ఏటిపాక భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, గిద్దలూరు తహశీల్దారు రాజారమేష్‌ను తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, మద్రిపూడి తహశీల్దార్ విజయలక్ష్మిని గుంటూరు సర్వశిక్ష అభియాన్ పీఓగా, ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే డీ రాజగోపాల్‌ను టీటీడీ డిప్యూటీ ఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రమేష్ నాయుడు పెనుగ్రంచిప్రోలు, మరో డిప్యూటీ కలెక్టర్ సరళావందనంను పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

- వ్యవసాయ సలహామండలి సమావేశంలో కలెక్టర్ దినేష్ కుమార్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని ఇంటర్నేషనల్ ఇయర్‌ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రకటించిందని, జిల్లాలో చిరుధాన్యాల సాగును మరింత ప్రోత్సహించి దిగుబడి పెంచాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. ప్రకాశం భవనంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం జిల్లా చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు తెలియచేయాలన్నారు. జిల్లాలో కౌలు రైతులకు కౌలు సాగుదారు హక్కు పత్రాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటైన జేఎల్‌జీ, ఎఫ్‌ఐజీ గ్రూపులకు బ్యాంకుల నుంచి విధిగా రుణాలు మంజూరయ్యేలా చేస్తామన్నారు. జిల్లాలో జరుగుతున్న ధాన్య మద్దతు ధర కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి నష్టపోకుండా ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని కౌలు రైతులకు పంట రుణాలు అందేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. రైతుల వద్ద ఉన్న మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దీనిలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యునిగా నియమితులైన ఆళ్ల రవీంద్రారెడ్డిని కలెక్టర్ సత్కరించి అభినందించారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

ఒంగోలు అర్బన్: రోడ్డు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకుని వాహనాలు నడపాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రకాశం భవనం నుంచి అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి పాల్గొన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. సాయంత్రం ప్రకాశం భవనంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌లు వినియోగించడం, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టులు పెట్టుకోవడం వంటివి ప్రజలు విధిగా పాటించాలన్నారు. రహదారుల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రోడ్డు రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనిలో పోలీసు, ట్రాఫిక్, రోడ్డు రవాణా, నేషనల్ హైవే శాఖల అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, మేయర్

- కందుకూరు తొక్కిసలాట ఘటనపై బాధిత కుటుంబాలు, క్షతగాత్రుల ఆవేదన
- ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌లో శేషశయనారెడ్డి కమిషన్ విచారణ
- బాధితులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి వాంగ్మూలం నమోదు
- ప్రమాదం జరిగిన స్థలంలో సీన్ టూ సీన్ కమిషన్ ఆరా
- కొందరు ప్రకటించిన పరిహారం అందలేదని కమిషన్ దృష్టికి తెచ్చిన బాధితులు



ఎన్‌టీఆర్ సర్కిల్ ప్రాంతంలో వివరాలు తెలుసుకుంటున్న శేషశయనారెడ్డి

ఫ్లెక్సీలు కట్టి ప్రాణాలు తీశారు

‘టీడీపీ నేతల అత్యుత్సాహం.. నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు కట్టడంతో రోడ్డు ఇరుకైంది. ప్రచార యావతో చంద్రబాబు వాహనం ఒక్కసారిగా ముందుకు రావడంతో జనాలు తోసుకున్నారు. ఒకరిపై ఒకరు కిందపడడంతో అలజడి రేగింది. తొక్కిసలాటలో ఎనిమిది మంది ప్రాణాలు పోయాయి. ఇంకొంత మంది గాయపడ్డారు. మరికొందరు పక్కనే ఉన్న చిన్న కాలువలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు.’ అంటూ బాధిత కుటుంబాలు, క్షతగాత్రులు హైకోర్టు రిటైర్ జడ్జి జస్టిస్ శేషశయనారెడ్డి ఏకసభ్య కమిషన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. కొందరు నాయకులు పరిహారం ఇస్తామని ప్రకటించినా.. ఇంత వరకు సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



గుండంకట్ట రోడ్డు పక్కన కాల్వను పరిశీలిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

కందుకూరు: టీడీపీ అధినేత చంద్రబాబు గత నెల 28న కందుకూరు నిర్వహించిన బహిరంగ సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ శుక్రవారం విచారణ చేపట్టింది. డ్రోన్ కెమెరాల వీడియోలతో జనం మరింత మంది వచ్చారనే చెప్పుకునేందుకు చేసిన చంద్రబాబు ప్రచార యావకు 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై హైకోర్టు రిటైర్ జడ్జి జస్టిస్ శేషశయనారెడ్డి ప్రమాదం జరిగిన ఎన్‌టీఆర్ సర్కిల్ గుండంకట్ట రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ప్రమాద బాధితులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. మృతుల కుటుంబాల నుంచి ఒక్కొక్కరు, క్షతగాత్రుల్లో ఏడుగురు, ప్రత్యక్ష సాక్షులు 12 మంది కమిషన్ ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. ప్రమాదం జరిగిన తీరును వివరించారు. ప్రధానంగా ఇరుకైన రోడ్డులో టీడీపీ నాయకులు అధికంగా కట్టిన ఫ్లెక్సీలతో మరింత ఇరుకై జనాలు ఒక్కసారిగా తోసుకోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు బాధితులు కమిషన్‌కు తెలిపారు.. చంద్రబాబు వాహనం ఒక్కసారిగా ముందుకు రావడం వల్ల వాహనం వెంట వచ్చిన వారు ముందుకు దూసుకురావడంతో తొక్కిసలాట జరిగిందని కొందరు, ఫ్లెక్సీలు కట్టడం వల్ల రోడ్లు చిన్నదైందని మరికొందరు, ఏర్పాట్లు సరిగా లేవని, పోలీసులు లేరని కొందరు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై ప్రభుత్వ అధికారులెవరినీ ప్రస్తుతానికి కమిషన్ విచారించలేదు. కేవలం ప్రమాద ఘటనపై మాత్రమే వివరాలు సేకరించింది.

బహిరంగ సభ ప్రాంతంలో క్షుణ్ణంగా పరిశీలన

శుక్రవారం ఉదయం జస్టిస్ శేషశయనారెడ్డి తన బృందం కందుకూరుకు చేరుకుంది. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో అధికారులు, ఎస్పీ విజయారావు, జేసీ కూర్మనాథ్ నుంచి కొన్ని ప్రాథమిక వివరాలు సేకరించారు. అనంతరం నేరుగా ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. సభ నిర్వహణకు అనుమతులు ఎలా తీసుకున్నారు. వాటిని పాటించారా? సభ ఎక్కడ జరగాలి? చంద్రబాబు ప్రసంగ వాహనం ఎక్కడ నిలపాలి, ఎక్కడ నిలిపారు, ఎంత దూరం ముందుకు వచ్చారు.. అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన గుండంకట్ట రోడ్డుకు చేరుకుని ఆ స్థలాన్ని పరిశీలించారు. ఘటన ఎలా జరిగిందనే విషయాలను సీన్ టూ సీన్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషన్ అధికారులను కొన్ని ప్రశ్నలు వేసినట్లు సమాచారం. చాలా పత్రికల్లో కాలువలో పడి చనిపోయినట్లు వార్తలు వచ్చాయి కదా ఆ కాలువ ఎక్కడ ఉందని ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో కాలువలో ఎంత నీరు ఉందని ఆరా తీశారు. అయితే కాలువలో పడి ఎవరూ చనిపోలేదని, కేవలం తొక్కిసలాట వల్లే ప్రాణాలు కోల్పోయారని కమిషన్‌కు స్థానిక పోలీసులు అధికారులు వివరించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ కాలువలో అడుగు మేర కూడా నీరు లేదని వివరించారు. తప్పించుకోవడానికి కొందరు కాలువలో దూకి ప్రాణాలు కాపాడుకున్నారని కమిషన్‌కు వివరించినట్లు తెలిసింది. అనంతరం ఆ కాలువలను సైతం జస్టిస్ శేషశయనారెడ్డి స్వయంగా వెళ్లి పరిశీలించారు. బహిరంగ సభ జరిగిన సమయంలో ఎంత మంది హాజరయ్యారు, చంద్రబాబు కాన్వాయ్‌తో వచ్చిన వాహనాలను ఎటు వైపు మళ్లించారనే వివరాలను, ప్రమాద స్థలం నుంచి చికిత్స అందించిన హాస్పిటల్ ఎంత దూరంలో ఉందనే వివరాలపై కూడా ఆరా తీశారు. మ్యాపుల ఆధారంగా కమిషన్‌కు ఈ వివరాలను అధికారులు క్షుణ్ణంగా వివరించారు.

సుదీర్ఘ విచారణ

అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న జస్టిస్ శేషశయనారెడ్డి నేతృత్వంలోని కమిషన్ సాక్షుల నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. ఆ రోజు ఘటనలో మృతి చెందిన 8 మంది మృతుల కుటుంబాల నుంచి ఒక్కొక్కరిని నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. గాయపడినలో 8 మందిలో ఏడుగుర్ని, ప్రత్యక్ష సాక్షులు 12 మంది నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. వీరిని ప్రధానంగా రెండు అంశాలపై ఆరా తీశారు. తొక్కిసలాట ఎలా జరిగింది, మీకు ప్రకటించిన పరిహారం మొత్తం అందిందా లేదా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరు నాయకులు ప్రకటించిన పరిహారం ఇంకా కొంత అందాల్సి ఉందని చెప్పినట్లు సమాచారం. మృతుల కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.20 లక్షల నుంచి రూ.23.50 లక్షల వరకు పరిహారం అందిందని కమిషన్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. కమిషన్ వెంట సబ్‌కలెక్టర్ శోభిక, డీఎస్పీ కండే శ్రీనివాసులు, కందుకూరు, గుడ్లూరు సీఐలు వెంకట్రావ్, సుబ్బారావు, పలువురు ఎస్సైలు, తహసీల్దార్లు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ సైలెన్సర్‌పై పడడంతో ముఖం కాలింది



అందరూ ఒక్కసారి నెట్టడంతో ఒక్కసారిగా బైక్ సైలెన్సర్‌పై పడిపోయాను. దీంతో ముఖం, మెడ భాగంగా బాగా కాలిపోయింది. హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటున్నాను. ప్రమాదం ఎలా జరిగిందని అడిగారు. నేను కిందపడిపోయిన విషయాన్ని చెప్పాను. గాయపడిన నాకు ఇస్తామన్న పరిహారం ఇంకా ఇవ్వలేదని చెప్పాను.
– రాగమ్మ, గుండ్లపాలెం

పక్కటెముకలు దెబ్బతిన్నాయి



తొక్కిసలాట ఎలా జరిగిందని నన్ను అడిగారు. అందరూ ఒక్కసారిగా నెట్టుకుంటూ ముందుకు రావడంతో నేను కిందపడిపోయానని, నాపై నుంచి జనం తొక్కుకుంటూ వెళ్లడంతో పక్కటెముకలు విరిగినట్లు చెప్పాను. కావలిలో గాయాలకు చికిత్స చేయించుకుంటున్నానని, ఇంకా తగ్గలేదని చెప్పాను.
– గోచిపాతల రమేష్, మోచర్ల

పోలీసు కానిస్టేబుల్ పరీక్ష రేపు



ఎస్పీ మలికా గర్గ్

- జిల్లాలో 38 పరీక్ష కేంద్రాలు
- 22,281మంది అభ్యర్థులు హాజరు
- ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతి ఉండదు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు
- ఎస్పీ మలికా గర్గ్ వెల్లడి

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ఈనెల 22 ఆదివారం నిర్వహించనున్న ప్రాథమిక రాత పరీక్షలకు అన్నీ రకాల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 22,281 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, వీరిలో పురుషులు 17,833 మంది, మహిళలు 4448 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో 17, మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో 21 మొత్తం 38 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను అనుమతిస్తారని, 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యం అయినా అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. హాల్ టికెట్లలో పేర్కొన్న నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచీలు, బ్లూ టూత్, కాలిక్యులేటర్ లాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అనుమతించేది లేదన్నారు.

అమలులో 144 సెక్షన్:

పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెక్షన్ 144 విధిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంబంధిత పోలీసు అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించారని, స్ట్రాంగ్ రూంలు, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారని వివరించారు. పోలీసు శాఖ అధికారులు, రీజినల్ కో ఆర్డినేటర్, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు సమన్వయంగా విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఒంగోలులోని పరీక్ష కేంద్రాల వద్ద అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, మార్కాపురానికి అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎస్‌వీ శ్రీధరరావులను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టు పక్కల జిరాక్స్ షాపులను మూసి వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ట్రాఫిక్ క్లియరెన్స్:

అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరడానికి మార్గమధ్యంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండుల వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ని, మూడు నాలుగు కేంద్రాలకు క్లస్టర్ చేసి ఒక ఇన్‌స్పెక్టరును ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా, సక్రమంగా జరిగేలా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

సొంతింటి కల సాకారం చేసుకోండి

- లబ్ధిదారులతో కలెక్టర్ దినేష్‌కుమార్
- పొదిలిలో పలు కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్



ఆధార్ అప్‌డేట్ సెంటరును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

పొదిలి రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్లను నిర్మించుకొని లబ్ధిదారులు సొంతింటి కల సాకారం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. పొదిలి విశ్వనాథపురంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. లబ్ధిదారుడు స్వంతంగా నిర్మించుకుంటే మంచిదని, ఆర్థికంగా వెసులుబాటు లేని వారికి ఇల్లు నిర్మించి ఇవ్వడానికి జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. నిబంధనలు ప్రకారం ప్రభుత్వం గృహ నిర్మాణానికి ఇచ్చే రూ.1.80 లక్షలతో పాటు పావలా వడ్డీ ద్వారా రూ.35 వేల రుణంతో ఇల్లు పూర్తి చేస్తామన్నారు. పొదిలి లేఅవుట్‌లో మొత్తం 2200 ప్లాట్ల వేశామని, అందులో 1800 మందికి పట్టాలిచ్చామని చెప్పారు. 1608 ఇళ్లు మంజూరు కాగా, 550 మందికి పైగా సొంతంగా ఇల్లు నిర్మించుకుంటున్నారని, 1052 మందికి జేఎస్ఆర్ సంస్థకు ఇళ్లు నిర్మించేందుకు పనులు చేపట్టిందన్నారు. ఇప్పటికే 350 గృహాలకు బేస్ మట్టానికి దగ్గర పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇక మొత్తం 8 బ్లాక్‌లు ఉండగా 4, 5 బ్లాక్‌ల్లో నీటి సమస్య ఉందని చెప్పారు. ఇక్కడికి 10 రోజుల్లో పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. నిర్మాణాలు పూర్తైన వారికి తాత్కాలికంగా మున్సిపాలిటీ నుంచి నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన వారికి ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇస్తామన్నారు. కాటూరివారిపాలెంకు చెందిన 58 మంది లబ్ధిదారులకు ఇక్కడ ప్లాట్లు కేటాయిస్తామన్నారు. పొదిలి జగనన్న లేఅవుట్‌లో ఉగాది పండుగ నాటికి 162 గృహాలు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసేలా లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. ఇళ్లు మంజూరైన 350 లబ్ధిదారులు డ్వాక్రా గ్రూపులో లేకపోవడంతో వెలుగు సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. 10 రోజుల్లో అందరినీ గ్రూపుల్లో చేర్చాలని, లేని పక్షంలో సిబ్బంది మొత్తాన్ని సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఈ లేఅవుట్‌లో రూ.29 కోట్లతో రోడ్లు లెవల్, నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, అన్ని వసతులు కల్పించామన్నారు. విరాట్ నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రూ.82 లక్షలతో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ప్రభుత్వ బాలరు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆధార్ అప్‌డేట్ సెంటరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం-4 ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పడమటిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కె సందీప్‌కుమార్, హౌసింగ్ పీడీ పేరయ్య, డీఈ పవన్‌కుమార్, ప్రత్యేకాధికారి జగన్నాథరావు, మున్సిపల్ కమిషనర్ డానియల్ జోషఫ్, తహశీల్దార్ డి.భాగ్యలక్ష్మి, ఎంపీడీవో శ్రీకృష్ణ, వివిధ శాఖల ఏఈలు, అన్ని శాఖల అధికారులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా కలిసికట్టుగా పని చేయండి

- మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా నూతన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలునిచ్చారు. మండలంలోని దేవరాజుగట్టులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండాను మరోమారు రెపరెపలాడించేలా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో వలంటీర్లు, కన్వీనర్లు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో రూ.176 వేల కోట్లు నగదు బదిలీ ద్వారా నిరుపేదలకు క్రమం తప్పకుండా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

నియోజకవర్గంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసిన యజమానులకు దాదాపు రూ.35 నుంచి రూ.40 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉందని, సీఎం దృష్టికి తీసుకెళ్లానని, వారికి త్వరలో పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తుందని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి పరిష్కారం కోసం చెరువుల్లో బోర్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రూ.1500 నుంచి రూ.1800 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వంలో వెలిగొండ ప్రాజెక్టు పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, పాత కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త కాంట్రాక్టర్‌ను పెట్టడంతో రూ.7 వేల కోట్ల నుంచి రూ.9 వేల కోట్ల వరకు బడ్జెట్ పెరిగిందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో పెద్దారవీడు మండలంలో 90 శాతం నిర్వాసితుల కుటుంబాలున్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి నష్ట పరిహారం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.12.50 లక్షలు అందించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న కుటుంబాలకు రూ 1300 నుంచి రూ.1400 కోట్ల ప్యాకేజి ఇవ్వాల్సి ఉందని, మార్చి లేక ఏప్రిల్ నెలలో నిర్వాసితుల ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. 2023లోనే ప్రాజెక్టులోకి కృష్ణమ్మ నీటిని విడుదల చేయడానికి చర్యలు చేపట్టారన్నారు. గుండంచర్ల గ్రామ నిర్వాసితులకు దేవరాజుగట్టు గ్రామం సమీపంలో 54 ఎకరాల్లో మౌలిక వసతులతో పనులు చేపట్టారని, కంట్రాక్టర్ల బిల్లులు కూడా వస్తున్నాయన్నారు. పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా మిరప పంటను రైతులు సాగు చేస్తున్నారని, కోల్డ్ స్టోరేజి, గిడ్డంగులు, మిరప కాయలు అరబెట్టేందుకు ప్లాట్‌ఫాం నిర్మాణం కోసం రూ.50 నుంచి రూ.100 కోట్ల వరకు నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మార్కాపురంలో మెడికల్ కళాశాల, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పెద్దదోర్నాలలో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణంలో ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

26 వరకు పదో తరగతి ఫీజు చెల్లింపునకు అవకాశం

ఒంగోలు: ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు తత్కాల్ విధానంలో పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు డీఈవో బి.విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము రూ.500 తో ఈ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అపరాధ రుసుం వెయ్యి రూపాయలతో ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు నామినల్ రోల్స్‌ను మరుసటి రోజు లోపల ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. పరీక్ష ఫీజు ఇప్పటికి కూడా చెల్లించని వారు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

సీఐ రంగనాథ్‌కు ఎస్పీ అభినందన


ఎస్పీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: స్థానిక సర్కిల్ పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారంలో అత్యున్నత ప్రతిభ కనబరచిన సీఐ దాచేపల్లి రంగనాథ్‌కు ఎస్పీ మలికా గర్గ్ రివార్డు, ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రంగనాథ్ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి స్టేషన్లలో ఎన్నో ఏళ్లుగా 330 పెండింగ్ కేసులు ఉన్నాయన్నారు. ఆరునెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన తాను, ఎస్పీ ఆదేశాలతో పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించానన్నారు. 180 కేసులను పరిష్కరించడంతో జిల్లాలో ఉత్తమ సర్కిల్ స్టేషన్‌గా గుర్తింపు దక్కిందని చెప్పారు. కేసుల పరిష్కారానికి సహకరించిన జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వరరావు, టంగుటూరు ఎస్సై షేక్ ఖాదర్‌బాషాకు ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారని వివరించారు. ఈ సందర్భంగా సీఐకి ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా, సిబ్బంది అభినందనలు తెలిపారు.

23 నుంచి ఏపీ సీఎం కప్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఏపీ సీఎం కప్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు సెట్ప్ సీఈవో బి.బాబూరావు, చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న బాక్సింగ్–మార్కాపురం, టెన్నిస్–గిద్దలూరు, 24న ఖోఖో బాలురు–జె.పంగులూరు, 25న హాకీ–మైనంపాడు, 27న ఖోఖో బాలికలు–కనిగిరి మండలం కంచర్లపాలెం జెడ్పీ హైస్కూలు, వెయిట్ లిఫ్టింగ్–ఒంగోలు భారతీయ వ్యాయామ కళాశాల, బ్యాడ్మింటన్–ఒంగోలు మినీ స్టేడియం, టేబుల్ టెన్నిస్–కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9121106840ను సంప్రదించాలని సూచించారు.

రేపు జీఎస్టీపై అవగాహన సదస్సు

ఒంగోలు: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీపై ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ చుండూరు సుధీర్ అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న ఆపిల్ హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణ ప్రసాద్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి అక్కయ్య నాయుడు పాల్గొంటారని, వాణిజ్య, వ్యాపార రంగాలకు చెందిన వారు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని శిద్దా సుధీర్ కుమార్ కోరారు.

వచ్చే నెల 5న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ఒంగోలు: 2022–23 విద్యా సంవత్సరానికి జాతీయ ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) ఫిబ్రవరి 5న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచారన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యుడైస్ కోడ్ ను ఉపయోగించి లాగిన్ అయ్యి తమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాల్సిందిగా పాఠశాల హెడ్మాస్టర్లను ఆదేశించారు.

ఉత్సాహానికి కౌంట్ డౌన్

- 23 నుంచి క్రీడా పండుగ
- లయన్స్, జేసీస్ సంయుక్తంగా నిర్వహణ
- వేదికగా పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల
- 3 నుంచి 10వ తరగతి వరకు మూడు విభాగాలుగా పోటీలు
- బాలబాలికలకు వేర్వేరుగా..



ఒంగోలు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారుల్లో క్రీడోత్సాహాన్ని నింపేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్, ఒంగోలు జేసీస్‌లు సంయుక్తంగా నడుం బిగించాయి. ఇందుకుగాను స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. సంబంధిత క్రీడా పోస్టర్‌ను సమగ్రశిక్ష కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి.విజయభాస్కర్ శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కరోన తరువాత క్రీడల అవసరాన్ని సమాజం మిక్కిలిగా గుర్తించిందన్నారు. గతంలో కంటే నేడు క్రీడాకారుల సంఖ్య పెరుగుతోందని, అందుకు తగ్గట్లుగా లయన్స్, జేసీస్ వంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. చిన్నారుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు, స్ఫూర్తి నింపేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భావి క్రీడాకారుల క్రీడా సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ మాట్లాడుతూ 3,4,5 తరగతులను ఒక కేటగిరీ, 6,7,8 తరగతులను రెండో కేటగిరీ, 9,10 తరగతులను మూడో కేటగిరీగా విభజించామన్నారు. 6 నుంచి 10 తరగతుల వరకు బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి విజేతలను ఎంపికచేసి బహుమతులను అందిస్తామని వివరించారు. క్రీడా పోటీల ప్రాజెక్టు కోఆర్డినేటర్ సోమినేని సురేష్ మాట్లాడుతూ ఒక్కో ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాల నుంచి ఒక ఈవెంట్‌కు ముగ్గురిని మాత్రమే అనుమతిస్తామన్నారు. చదరంగానికి సంబంధించి ఎవరి బోర్డు వారే తెచ్చుకోవాలన్నారు. క్రీడా పోటీల ప్రాజెక్టు చైర్మన్ పి.జాలిరెడ్డి, వి.శ్రీరాములు రెడ్డి, బి.వి పవన్‌కుమార్, ఆత్మకూరి బ్రహ్మయ్య, బి.శ్రీకాంత్, కె.శివకోటిరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ కార్యదర్శి కసిబిసి నాగేశ్వరరావు, కోశాధికారి సూరే ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల వివరాలు..

3వ తరగతి బాలబాలికలకు: 50 మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, షటిల్ రన్, మెడిసిన్ బాల్‌త్రో, హోపింగ్.

4వ తరగతి బాలబాలికలకు: 60 మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, షటిల్ రన్, మెడిసిన్ బాల్‌త్రో, హోపింగ్.


క్రీడా పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి విజయభాస్కర్

5వ తరగతి బాలబాలికలకు: 70 మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, షటిల్ రన్, మెడిసిన్ బాల్‌త్రో, హోపింగ్.

6,7,8 తరగతుల బాలురకు: 100 మీ, 200 మీటర్ల పరుగు , షాట్‌పుట్, డిస్కస్‌త్రో, స్టాండింగ్ బ్రాడ్ జంప్, స్కిప్పింగ్, చదరంగం, 3 నిమిషాలపాటు సూర్య నమస్కార పోటీలు.

6,7,8 తరగతుల బాలికలకు: 100 మీ, 200 మీటర్ల పరుగు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, స్కిప్పింగ్, చదరంగం.

9,10 తరగతుల బాలురకు: 100 మీ, 200 మీ పరుగు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, స్టాండింగ్ బ్రాడ్ జంప్, చదరంగం, 5 నిమిషాలపాటు సూర్యనమస్కార పోటీలు.

9,10 తరగతుల బాలికలకు: 100 మీ, 200 మీ పరుగు, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, స్కిప్పింగ్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, చదరంగం.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి సురేష్

త్రిపురాంతకం: గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని అధికారుల సమక్షంలో పరిష్కరించి, సంక్షేమాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాంది పలికిందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం మేడపిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన మంత్రి సురేష్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పనిచేస్తోందని పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కరోనా సమయంలో ప్రజల ఇబ్బందులు చూసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజల అకౌంట్లలో జమ చేశారన్నారు. గత ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశాయన్నారు. గతంలో కార్యాలయాల చుట్టు తిరిగిన ప్రజలకు ప్రయోజనం కనిపించలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అధికారులే నేరుగా గడప గడపకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు సమస్యలపై ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. పక్కాగృహాలు, నివాస స్థలాలు, పింఛన్లు అర్హులకు అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి స్పష్టం చేశారు. కార్యాక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ మరియదాస్, ఏఓ నీరజ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాచగొర్ల సుశీల వెంకట సుబ్బయ్య, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సర్పంచ్ గుమ్మా యల్లమ్మ, ఎంపీటీసీ కృష్ణ, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కోకన్వీనర్ యల్లారెడ్డి, పార్టీ నాయకులు దగ్గుల గోపాల్‌రెడ్డి, నల్లూరి నాగేశ్వరరావు, గుమ్మా చిన్న వీరయ్య, రంగబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ లబ్ధి కరపత్రాన్ని అందిస్తున్న మంత్రి సురేష్

గడప గడపలో వెల్లువెత్తిన అభిమానం


పులికొండలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పర్యటన

- పులికొండలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏ ఇంటికెళ్లినా సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారుల అభిమానం వెల్లువెత్తింది. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం పులికొండ సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతి గడపలో సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులు పూల వర్షం కురిపిస్తూ పూలమాలలతో శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేయటం వలనే వైఎస్సార్ సీపీ, టీడీపీ, ఇతర పార్టీలనే తేడా లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించామని బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులొచ్చినా నిరంతరం సంక్షేమ పథకాలకు అంతరాయం కలగకుండా క్రమం తప్పకుండా పేదల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో జరిగిన నాడు–నేడు ఆధునికీకరణ పనులు, సిమెంట్ రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలకు బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేశారు. తొలుత గ్రామంలోకి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు హాజరైన వారికి స్థానిక సర్పంచ్ ఎం.రాజేంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య, మాజీ మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దాసరి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పోలినేని రమాదేవి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న నేతలు

మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- సబ్ కలెక్టర్ సేథు మాధవన్‌తో కలిసి అధికారులతో సమీక్ష

త్రిపురాంతకం: మహా శివరాత్రి మహోత్సవాలను బాలాత్రిపుర సుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో వైభవంగా నిర్వహించేందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. స్థానిక బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద సబ్‌కలెక్టర్ సేథు మాధవన్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహా శివరాత్రి రోజు లక్ష మందికి పైగా భక్తులు రానున్నారని, అందుకు తగిన విధంగా ఆలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆలయాలను సుందరంగా ముస్తాబు చేయాలని చెప్పారు. అధికార యంత్రాంగం వారి పరిధిలో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. రెవెన్యూ, దేవాలయ అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన ఏర్పాట్లు పూర్తిచేసిన నివేదికలతో సమీక్షలో పాల్గొనాలని ఆదేశించారు. యర్రగొండపాలెం రోడ్డులోని సాగర్ కాలువ వద్ద రెండవ వంతెన నిర్మాణానికి సుమారు రూ.7.65 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అమ్మవారి ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆర్థిక సహకారంతో షెడ్స్ నిర్మించామన్నారు. మార్బుల్ నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం వద్ద కొండ చదునుకు సుమారు మూడు కోట్ల రూపాయలతో పెరల్స్ గ్రానైట్స్ అధినేత రాజబాబు పనులు పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దాతల సహకారంతో ఆలయాలను మరింత అభివృద్ధి చేయనున్నామన్నారు. సబ్‌కలెక్టర్ సేథు మాధవన్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించి, పనులు పూర్తయిన వివరాలు తహసీల్దార్ కిరణ్‌కు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో దర్శి డీఎస్పీ స్వామినారాయణరెడ్డి, సీఐ రాంబాబు, ఎస్‌ఐ వెంకట సైదులు, ఈఓ చెన్నకేశవరెడ్డి, వైద్యాధికారి నాగేశ్వరరావునాయక్, విద్యుత్ డీఈ నాగేశ్వరరావు, ఏఈ మంగారావు, ఎస్‌ఎస్పీ డీఈ ఆంజనేయ ప్రసాద్, ఎంపీడీఓ మరియదాస్, ఈఓఆర్‌డి మణిమోహన్, ఎంఈఓ కె.తులసి మల్లికార్జుననాయక్, ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ పద్మజ మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పక్కన సబ్ కలెక్టర్ సేథు మాధవన్

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

APMDC
APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలు కానుంది.

టోర్నీ ఫార్మాట్..
ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..
ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్ లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...
ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..
ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
సెల్: **9010357744, 9912671555**
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఒంగోలు: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ 7వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో ఫిర్యాది షేక్ ఫాతిమా నివాసం ఉంటోంది. ఆమెకు ముగ్గురు కుమారులు. వారిలో మృతుడు నాగూర్(22) మూడో సంతానం. 2014 మార్చి 8వ తేదీ రాత్రి నాగూర్‌ను అదే కాలనీలో నివాసం ఉండే దూదేకుల చిన మౌలాలి వచ్చి పని ఉందంటూ తీసుకువెళ్లాడు. మరుసటి రోజు ఉదయం నాగూర్ ఇంటి ఎదురుగా ఉండే వ్యక్తి ఫిర్యాది వద్దకు వచ్చి తర్లుబాడు రోడ్డులో అల్లూరమ్మ గుడి వద్ద నాగూర్ హత్యకు గురైనట్లు తెలిపాడు. దీంతో ఆమె తన కుమారునికి, చిన మౌలాలి భార్యతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో హత్య చేసి ఉంటాడంటూ మార్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పటి సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. దీనిపై అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సి.శ్రీనివాసమూర్తి వాదించారు. నేరం రుజువైనట్లుగా పేర్కొంటూ ముద్దాయి చిన మౌలాలికి జీవిత ఖైదు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో నెలరోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి స్పష్టం చేశారు.